లీకేజీ పనులు పూర్తి

కొల్లాపూర్‌రూరల్, డిసెంబర్ 8 : సింగోటం నుంచి కొల్లాపూర్‌కు వచ్చే మిషన్ భగీరథ మంచి నీటి సరఫరా పైపులైన్ సింగోటం క్రాస్‌రోడ్డు వద్ద లీకేజీ కావడంతో ఆయా గ్రామాలకు రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచి పోయింది. అదివారం మున్సిపల్ సిబ్బంది శ్రమించి పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతు పనులను పూర్తి చేశారు. సోమవారం మండల కేంద్రంతోపాటు ఈదమ్మబావి, పెద్దబావి గ్రామాలకు యథావిధిగా మంచినీరు సరఫరా చేస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్ తెలిపారు.

సామాజిక పోరును ఉధృతం చేయాలి

తాడూరు, డిసెంబర్ 8 : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ పోరాట స్ఫూర్తితో సామాజిక పోరును ఉధృతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భరత్ పిలుపునిచ్చారు. ఆదివారం తాడూరు మండలంలోని అంతారం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీహెచ్‌ఎస్ జిల్లా సలహాదారు మోహన్, మండల ఉపాధ్యక్షుడు రాజు, ఆంజనేయులు, కృష్ణయ్య, హనుమంతు, వెంకటయ్య, శ్రీను, కృష్ణమ్మ, మైసమ్మ, బక్కమ్మ, నర్సమ్మ, ఆలివేల, వెన్నెల ఉన్నారు.

వంట చెరుకు దగ్ధం

కొల్లాపూర్ రూరల్, డిసెంబర్ 8 : కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ సమీపంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమానికి ఉపయోగించే వంట చెరుకు దగ్ధమైనట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాదాపు రెండు టన్నుల నిల్వ ఉన్న వంట చెరుకుకు నిప్పుపెట్టినట్లు నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కొల్లాపూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వారు పేర్కొన్నారు.

9 మంది కోళ్ల పందెం రాయుళ్ల అరెస్టు

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 8: జిల్లా కేంద్రంలో సమీపంలోని చందాయపల్లి వద్ద కోళ్లపందెం స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఏఎస్సై చంద్రయ్య కథనం మేరకు విశ్వసనీయ సమాచారం మేరకు చందాయపల్లి శివారులో కోళ్ల పందెం ఆడుతున్న 9 మంది కోళ్ల పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 6 పందెం కోళ్లు, 7 బైకులు, 8 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్సై చంద్రయ్య తెలిపారు.

పోస్టర్ విడుదల

పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

బల్మూరు, డిసెంబర్ 8 : మండలకేంద్రంలో ఈనెల 14, 15వ తేదీల్లో జరిగే సీపీఎం పార్టీ జిల్లా మహాసభకు సంబంధించిన గోడ పత్రికను మండల కార్యదర్శి శంకర్‌నాయక్ ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, యాదగిరి, లక్ష్మయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కల్వకుర్తి రూరల్, డిసెంబర్ 8 : ఈనెల 14, 15వ తేదీల్లో అచ్చంపేటలో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలో సీపీఎం జిల్లా మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. మహాసభలు జాతీయ నాయకులు కామ్రేడ్ రాఘవులు, ప్రజావాగ్గేయకారుడు గోరటి వెంకన్నతోపాటు పలువురు హాజరుకానున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, మల్లయ్య, బాల్‌రెడ్డి, కిశోర్, శ్రీనివాసులు, యాదయ్య, పరమేశ్, శంకర్, మహేశ్, కుర్మయ్య ఉన్నారు.

మహారాజశ్రీ, గౌరవనీయ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, అచ్చంపేట
(నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం)
O.S.No.165 of 2024
Between:
బొడ్డు శ్రీనివాస్ గౌడ్ ...వాది
మరియు
బొడ్డు పద్మ ... ప్రతివాది
To
బొడ్డు పద్మ భర్త శ్రీనివాసులు, వయస్సు 32 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం ఇంటి నెం.10-129, టంగాపూర్, అచ్చంపేట గ్రామం & మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా.
పై దావాలో వాది, మిమ్ములను ప్రతివాదిగా చేర్చినారు. మీకు కోర్టు నుండి ఎన్ని సార్లు సమన్లు పంపినప్పటికి అందకపోవడం వలన ఇట్టి ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా, తేది: 13-02-2025 రోజున ఉదయం 10-30 గంటలకు పై కోర్టులో మీరు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై మీ తరపు జవాబు దాఖలు చేయగలరు. లేనిచో మీ పరోక్షములో పై దావా పరిష్కరించబడును.
// కోర్టు వారి ఉత్తర్వు మేరకు //
ఎస్. మస్తాన్, న్యాయవాది, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం. Cell:9440352102

బస్సులు లేకపోవడంతో బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

బస్సుల కోసం పడిగాపులు

- మైసమ్మకు పోటెత్తిన భక్తులు
- నాగర్‌కర్నూల్ బస్టాండ్ ఆవరణలో వేచి ఉన్న జనాలు

నాగర్‌కర్నూల్‌టౌన్, డిసెంబర్ 8 : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పెద్ద కొత్తపల్లి మండల కేంద్రంలో ఉన్న నాయినోనిపల్లి మైసమ్మ వద్దకు వెళ్లేందుకు ఆదివారం ఉదయం భక్తులు పోటెత్తారు. కానీ సమయానికి బస్సులు లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్తీకమాసం ముగిసాక తొలి ఆదివారం కావడంతో భక్తుల రద్దీ అధికంగా ఉంది. సమయానికి బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొకతప్పలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పై అధికారుల సూచనల మేరకు బస్సులు సమయానికి నడుపుతుండడంతో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదు. కాని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పెట్టినా బస్సులు అందుబాటులో లేక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సమయానికి బస్సులు నడిపి ప్రయాణికులకు ఇబ్బందులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

బల్మూరు, డిసెంబర్ 8 : మండలంలోని కొండనాగుల ప్రభుత్వ ఉమామహేశ్వర డిగ్రీ కళాశాలలో ఆదివారం 20 14-17 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అప్పటి అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ పిరంగి రవి మాట్లాడుతూ చదువుకున్న పాఠశాల, కళాశాలలు మరచిపోకుండ ఉండేందుకు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం వల్ల స్నేహభావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రూప్‌సింగ్, జానుబాబు, లక్ష్మణ్‌గౌడ్, గాయత్రీ, నర్సింహ, పూర్వ విద్యార్థులు రవీందర్, రేణుబాబు, వెంకటేశ్, కురుమూర్తి, కుమార్ పాల్గొన్నారు.

ఉర్దూ మీడియం పోస్టులు భర్తీ చేయాలి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అభ్యర్థులు

నాగర్‌కర్నూల్‌టౌన్, డిసెంబర్ 8 : ఇతర కేటగిరిలకు రిజర్వ్ కావడంతో అభ్యర్థులు లేక ఖాళీగా ఉన్న ఉర్దూ మీడియం పోస్టులకు 2024 డీఎస్సీ రెండో మెరిట్ జాబితా విడుదల చేయాలని డీఎస్సీ అభ్యర్థులు కోరారు. ఈ మేరకు ఆదివారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్సీ అభ్యర్థులు మాట్లాడుతూ 2024లో జారీ అయిన డీఎస్సీ 2024 నోటిఫికేషన్‌లో రాష్ట్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలల్లో ఖాళీగా ఉన్న మొత్తం 1,183 మంది ఉపాధ్యాయ పోస్టులకు గానూ కేవలం 511 పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయన్నారు. మిగతా 672 పోస్టులు ఎస్సీ, ఎస్టీ, బీసీలోని బీసీ ఏ,సీ,డీ కేటగిరీల కు రిజర్వు అయి ఉన్న కారణంగా ఆ కేటగిరి అభ్యర్థులు లేక పోస్టులు భర్తీ కాలేదన్నారు. దీని వల్ల ఉపాధ్యాయులు లేక ఉర్దూ మీడియం పాఠశాలలు వెనబకడి పోతున్నాయన్నారు. తక్షణమే 2024 డీఎస్సీలోనే రెండో మెరిట్ జాబితా జిల్లాల వారీగా ప్రకటించి రాష్ట్రంలో మిగిలిన 672 పోస్టులు భర్తీ చేసి ఉర్దూ మీడియం అభ్యర్థులకు తగు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఖాజాబాబా, ఆల్ ఖైర్ సొసైటీ కన్వీనర్ న్యాయవాది హమీద్, మైనార్టీ సంఘం నాయకులు ఆహ్మద్, సమదాని, హారు తదితరులు, అభ్యర్థులు ఉన్నారు.

ఇందిరానగర్‌లో మున్సిపల్ చైర్మన్ పర్యాటన

కల్వకుర్తిరూరల్, డిసెంబర్ 8 : కల్వకుర్తి పట్టణంలోని ఇందిరానగర్‌లో ఇటీవల నిర్మించిన సీసీరోడ్లను కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో స్థానిక కౌన్సిలర్ సైదులు గౌడ్‌తో కలిసి పర్యటించి కాలనీవాసులతో మాట్లాడారు. కాలనీలో ఎలాంటి సమస్యలు తలెత్తినా కౌన్సిలర్ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

కల్వకుర్తిరూరల్, డిసెంబర్ 8 : కల్వకుర్తి పట్టణంలోని శీరిడి సాయి సత్యసాయి ప్రశాంతి సన్నిధిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతం అయింది. ఈ శిబిరంలో ప్రజలకు పలు రకాల వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్, నిర్వాహకులు, వైద్యులు కృష్ణ, సుప్రజ, రాజేశ్, చంద్రకాంత్, విజయ్, సౌమ్య, శ్రీధర్, పూజిత, సేవాదళ్ సభ్యులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

చార కొండ, డిసెంబర్ 8 : మండలంలోని గోకారంలో దామెద విజేందర్ గొంతు సంబంధిత చికిత్స పొంది అనారోగ్యంతో ఇంటి వద్ద ఉన్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు ఆదివారం పరామర్శించి రూ.13,500 ఆర్థిక సాయం అందజేశారు. బాధితుడికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, మహేశ్, వెంకటయ్య, నర్సింహ, హరి, లక్ష్మయ్య, రమేశ్, భాస్కర్, అనిల్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామ సభ

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 8 : మండలంలోని యాపట్లలో ఆదివారం ఉపాధి హామీ పనులపై ఉపాధి హామీ పథకం అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టావల్సిన పనులపై చర్చించి తీర్మానం చేశారు. ఇప్పటి వరకు గ్రామంలో 16 రకాల పనులకు రూ.19,25,930లు ఖర్చు చేసినట్లు ఫీల్డ్ అస్టింట్ నాగరాజు తెలిపారు. గ్రామ సభ ద్వారా పనులు గుర్తించినట్లు పంచాయతీ కార్యదర్శి పర శ్రీరామ్ తెలిపారు. సమావేశంలో ఏపీవో మంజుల, డీఆర్‌పీ రాములమ్మ, టీఏ శ్రీను, మాజీ సర్పంచ్ సీతారాం, గ్రామ పెద్దలు కృష్ణ గౌడ్, జహంగీర్, శ్రీశైలం, విష్ణు, బక్కయ్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

తీవ్రంగా గాయపడిన రవిగౌడ్

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 8: కొల్లాపూర్ చౌరస్తాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. నాగర్‌కర్నూల్ మండలం చందుబట్లకు చెందిన రవి గౌడ్ తన స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. దీంతో రవి గౌడ్‌కుడికాలు విరిగి నుజ్జునుజ్జయ్యింది. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్ మాదిగ

నూతన మండల కమిటీతో ఎమ్మార్పీఎస్ నేతలు

తిమ్మాజిపేట, డిసెంబర్ 8 : తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కమిటీలు, కమిషన్ అంటు కాలయాపన చేయకుండా ఏబీసీడీ వర్గీకరణ చేపట్టి అమలు చేయాలని కోరారు. వర్గీకరణ సాధన కోసం రాజకీయ నాయకులు, మాదిగలంతా ఒకటికావాలన్నారు. అనంతరం తిమ్మాజిపేట మండల ఎమ్మార్పీఎస్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండ లాధ్యక్షుడిగా ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా బంగారయ్య, రమేశ్, ప్రధాన కార్యదర్శిగా విష్ణు, మన్యం కొండ, అధికార ప్రతినిధిగా రవి శంకర్, కార్యదర్శులుగా వినోద్‌తో పాటు మరికొందరిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ అధ్యక్షుడు జంగయ్యమాదిగ, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌మాదిగ, నాయకులు దశరథం, కాశీం, జగన్‌రాజ్, దేవ స్వామి, వెంకటయ్య, స్వామి పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

వెల్దండ డిసెంబర్ 8 : చారకొండ మండలం ఎర్రపల్లి గ్రామానికి చెందిన సలేశ్వరం ఇటీవల మృతి చెందాడు. దీంతో 1998 ఎస్ఎస్‌సీ బ్యాచ్ స్నేహితులు సలేశ్వరం కుటుంబాకి అండగా నిలిచారు. స్నేహితులు అందరు కలిసి పోగు చేసిన రూ.85వేలు సలేశ్వరం పిల్లల పేరుపై బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు. దీంతో ఆదివారం వెల్దండలో ఎస్సై కురుమూర్తి, ఏఎస్సై జాకీహుల్లా ఖాన్ చేతుల మీదుగా మృతుడి భార్య రేణుకా, పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు అంజన్, సురేశ్, తిరుపతి, తిరుపతయ్య, శ్రీను, అన్వర్, యాదగిరి, కృష్ణ, కిరణ్ ఉన్నారు.

రూ.85వేలు అందజేస్తున్న స్నేహితులు

కార్మికులకు కనీస వేతనాలు పెంచాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నేత పర్వతాలు

అచ్చంపేట, డిసెంబర్ 8 : అసంఘటీత రంగాల కార్మికులకు కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పర్వతాలు అన్నారు. ఆదివారం పట్టణంలోని టీఎన్‌జీవో భవనంలో సీఐటీయూ అనుబంధ సంఘాల మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశ, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పర్వతాలు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు పెంచడం వల్ల 29 కార్మిక చట్టాలను కాలరాసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలు గాలికి వదిలేశారన్నారు. ఒక్క మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇతర ఏపథకం పూర్తి స్థాయిలో అమలు చేయకుండా మాటల తోనే కాలం గడిపారని అన్నారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో 25వేల మందికి ఇందిరమ్మ ఇండ్లు అందించాలని డిమాండ్ చేశారు. ఈనెల 14, 15న అచ్చంపేటలో సీపీఎం పార్టీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా కార్మిక సంఘాల నాయకులు శివకుమార్, ఎండీ సయ్యద్, మల్లేశ్, పార్వతమ్మ, సైదమ్మ, నిర్మల, రాములమ్మ, గొరెమ్మ, రేవతి, విజయలక్ష్మి, నిరంజన్, ఇసాక్, శ్రీను, వేమయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యేల పరామర్శ

లత్తీపూర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల

ఉప్పునుంతల, డిసెంబర్ 8 : మండలంలోని లత్తీ పూర్ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు కాకునూరు శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం మండలంలోని లత్తీపూర్‌లో ఆదివారం చేపట్టిన తుల్జా భవానీ మాతా ఆలయ ప్రారంభోత్సవానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనవెంట మాజీ సర్పంచ్ మల్లేశ్, నాయకులు రవి, లక్ష్మీపతి, రాజు, శ్రీకాంత్, లక్ష్మి, సైదులు, ఆంజనేయులు, ప్రశాంత్, రమేశ్, మహేశ్, పర్వతాలు, శ్రీను పాల్గొన్నారు.

సింగోటంలో

కొల్లాపూర్ రూరల్, డిసెంబర్ 8 : మండలంలోని సింగోటంలో బీఆర్ఎస్ నాయకులు చింతకుంట శ్రీనివాసులు, వెంకటస్వామి అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బాధితుల ఇండ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన తుపాకుల వెంకటస్వామి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకోని మాజీ ఎమ్మెల్యే బీరం బాధితుడి ఇంటి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.

బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటరూరల్/వంగూరు, డిసెంబర్ 8 : మున్సిపాలిటీకి అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని 14వ వార్డులో రూ. 16లక్షల వ్యయంతో నిర్మించున్న డ్రైనేజ్ సైడ్ వాల్ పనులను ఆయన మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులుతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి భూమిపూజ నిర్వహించారు. వంగూరు మండలం కొండా డ్డెపల్లిలో ఆదివారం వివిధ గ్రామాలకు చెందిన 50మంది రైతులకు మంజూరైన స్ప్రింక్లర్ సెట్లను రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే వంశీకృష్ణ అందజేశారు. అనంతరం గ్రామానికి చెందిన సైదమ్మ, లింగమయ్యలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో నాయకులు పాండురంగా రెడ్డి, వేమారెడ్డి, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు, వివిధ పార్టీల నాయకులు గోపాల్‌రెడ్డి, ఆకుల వెంకటేశ్, కాలనీవాసులు ఉన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గునగుంటపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఊర్కొండ, డిసెంబర్ 8 : మండలంలోని ఆయా గ్రామాల్లో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపనలు చేశారు. మండలంలోని గునగుంటపల్లిలో రూ.12లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్రానికి శంకుస్థాపన, జకినాలపల్లిలో తుర్కాంచెరువు కట్టనిర్మాణానికి రూ.5కోట్లు నిధులు మంజూరుకాగా నేడు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం రాచాలపల్లి నుంచి మాధారం గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు కావడంతో కార్యకర్తలు నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ముచ్చర్లపల్లి, జకినాలపల్లి గ్రామాల్లో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహం రూపు మార్చడం సిగ్గుచేటు

- బీఆర్ఎస్ మండల నాయకుడు అశోక్

సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

వెల్దండ, డిసెంబర్ 8 : తెలంగాణ తల్లి విగ్రహం రూపు రేఖలు మార్చడం సిగ్గు చేటు అని వెల్దండ మండల బీఆర్ఎస్ నాయకుడు పోలె అశోక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ఆనవాలుగా ఉండే తెలంగాణ విగ్రహ రూపం మార్చి పెట్టడం కాంగ్రెస్ పార్టీకి సిగ్గుచేటు అన్పిస్తలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెలంగాణ తల్లికి కూడా అవమానం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎంతో వైభవంగా నిర్వహించే బతుకమ్మ సంబురాలు చేయకుండా మహిళలను అవమానపర్చారని మండిపడ్డారు. తెలంగాణ ఇక్కడి ఆనవాలు లేకుండా చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజల నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నారాయణరాజు, గంగాధర్, జంగయ్య, రాములు ఉన్నారు.